క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: సాయివైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలు, యువతులకు మూడు నెలల పాటు ఉచితంగా ఎంబ్రాయిడరీ, మగ్గం, టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రఘువీర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 86889 01986 సంప్రదించాలని కోరారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న సుహాసినిరెడ్డి, నాయకులు

ఆదిలాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ అత్త వనజ ఇటీవల మృతిచెందారు. దీంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి సోమవారం బండి సంజయ్‌ని కరీంనగర్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె వెంట విజయ్ కుమార్, తాటి సతీష్, తోకల నరేశ్, వెంకటరెడ్డి ఉన్నారు.

తలమడుగు: మండలంలోని కప్పర్ దేవి గ్రామానికి చెందిన తలాండే సుంగు గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మాజీ కమీషన్ సభ్యురాలు నీలాదేవి సోమవారం ఆయన పరామర్శి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తలాండే శ్రీకాంత్, పెందూర్ లక్ష్మణ్‌రావు, తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె) పంచాయతీ పరిధిలో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏప్రిల్ ఒక్కటి నుంచి జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ సుభాస్ తెలిపారు. రెండేళ్ల కిందట రూ.2 కోట్లతో నిర్మించిన చెక్ డ్యాంలో ఉపాధి కూలీల ద్వారా పూడిక తీయిస్తున్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: ఇటీవల స్వచ్ఛ దూత్‌గా ఎంపికైన ఆదిలాబాద్ మున్సిపల్‌కి చెందిన మెప్మా రిసోర్స్ పర్సన్ టి.నవతను సోమవారం ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, కమిషనర్ శైలజ సత్కారించి అభినందించారు. కార్యక్రమంలో మెప్మా డీఎంసీ శ్రీనివాస్, మున్సిపల్ మేనేజర్ దివాకర్, టీఎంసీ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పెన్నులు అందజేత

బోథ్: మండలంలోని కనుగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చిలుక సతీశ్ విద్యార్థులకు పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసీ చైర్మన్ రాజు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నిఖిలేష్, ఉపాధ్యాయులు సీతారాం, రవి, మౌనిక, పూజ, అమృత, లింబన్న పాల్గొన్నారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: కంటివెలుగు వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని లక్కారం సర్పంచ్ జనార్దన్ అన్నారు. సోమవారం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న వీవోఏలు

నేరడిగొండ: వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని వీవోఏలు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17వరకు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం మండల సమైక్య అధ్యక్షురాలు వనజకు సమ్మె నోటీసు అందజేశారు. వీవోఏలకు రూ.20లక్షల సాధారణ బీమా కల్పించాలని, సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలని కోరారు.

'ఓసీలు ఏకం కావాలి'

బేల: ఓసీలంతా ఏకం కావాలని ఓసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జనగం సంతోష్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్‌లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీరామాలయం కమ్యూనిటీ హాల్‌లో ప్రమాణ స్వీకార మహోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 9న జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్‌లో నిర్వహించే సంఘం ప్రమాణ స్వీకార తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రఫుల్‌వర్మే, సుకాంత్‌రెడ్డి, దివాకర్ రెడ్డి, అనిల్ అమిడ్‌వార్, సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న ప్రయాణ కష్టాలు

- గ్రామీణ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



బీటీ రోడ్డుగా మారనున్న తాంసి- ధ్యాన్ మందిర్ రోడ్డు

తాంసి: మండలంలోని గ్రామీణ రోడ్లు గుంతలు పడి అధ్వాన్నంగా మారాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రతీఏటా గుంతల రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టేవారు. వర్షాకాలంలో మట్టిరోడ్లు దెబ్బతినడం, వాటిని ప్రజలు బాగు చేసుకోవడం పరిపాటిగా మారింది. తమ ఇబ్బందులను అనేకసార్లు ఎమ్మెల్యే బాపురావు దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దీంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.16 కోట్ల నిధులు విడుదల చేసింది. ఆయా గ్రామాలకు అనుసంధానంగా ఉన్న మట్టిరోడ్లు బీటీ రోడ్లుగా మారనున్నాయి.

6 గ్రామాలకు రూ.16 కోట్ల నిధులు మంజూరు..

మండలంలోని వివిధ గ్రామాలకు అనుసంధానంగా ఉన్న నాలుగు రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమశాఖ నిధుల ద్వారా రూ.16 కోట్లు విడుదల చేసింది. మండలంలోని బండల్‌నాగాపూర్ నుంచి పొన్నారి వరకు రూ.3.37 కోట్లతో 4.50 కిలో మీటర్ల రోడ్డు, బండల్‌నాగాపూర్ నుంచి జామిడి ఎక్స్‌రోడ్డు వరకు రూ.1.20 కోట్లతో 1.90 కిలో మీటర్లు, గిరిగాం నుంచి కై రిగూడ వరకు రూ.3 కోట్లతో 4 కిలో మీటర్లు, సావర్గాం నుంచి వడ్డాడి పంచాయతీరాజ్ రోడ్డు నుంచి బండల్‌నాగాపూర్ వరకు రూ.4.12 కోట్లతో 5.50 కిలోమీటర్లు, వడ్డాడి నుంచి తాంసి మండల కేంద్రానికి రూ.2.10 కోట్లతో 2.80 కిలో మీటర్లు, తాంసి జూనియర్ కళాశాల నుంచి ధ్యాన్ మందిర్ వరకు రూ.1.47 కోట్లతో 2.20 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

తప్పనున్న తిప్పలు..

రోడ్ల నిర్మాణంతో ప్రజల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారి రాకపోకలకు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. రోడ్డు సరిగా లేక వేరే గుండా తిరిగి వెళ్లాలంటే సమయంతో పాటు డబ్బు వృథా అయ్యేది. మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మార్చడంతో ప్రజల ఇబ్బందులు దూరం కానున్నాయి. ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించి పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీరోడ్డుగా మారనుంది



లింగి సమీపంలో ఉన్న అంతరాష్ట్ర రహదారి నుంచి ఉన్న మట్టిరోడ్డు గుంతలుగా మారింది. మట్టి రోడ్డు దెబ్బతినడంతో గ్రామస్తులు జిల్లా కేంద్రానికి వెళ్లి అంతరాష్ట్ర రహదారి గుండా తాంసి మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. ఎక్స్‌రోడ్డు నుంచి భీంపూర్ మండలంలోని కైరిగూడ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. దీంతో ఇబ్బందులు తీరనున్నాయి.

– గజానన్, గిరిగాం సర్పంచ్

ఎమ్మెల్యే సహకారంతో..



మండలంలోని వివిధ అభివృద్ధి పనులతో పాటు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కృషి చేస్తున్నారు. ఇప్పటికే మండలంలో పలు గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ప్రతీ గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణంతో పాటు రవాణా సౌకర్యం మెరుగు కానుంది.

– సురుకుంటి మంజుల, ఎంపీపీ, తాంసి

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు

తలమడుగు: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో పూలాజీ బాబా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తలమడుగులో పూలాజీ బాబా ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని ధ్యానం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. రూ. 5 లక్షలతో షెడ్డు నిర్మాణం, ప్రహరీ, గేట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కాటిపెల్లి సురేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నీలగిరి అశోక్, ప్రధాన కార్యదర్శి కాటి పెల్లి సునీత రెడ్డి, పొచ్చన్న, గణపతి, గంగారెడ్డి, లింగాల రాకేశ్, బాగిడి లక్ష్మి, కాటిపెల్లి అనితారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చేరికలు

బజార్‌హత్నూర్: మండలంలోని గిర్నూర్ గ్రామ వీడీసీ చైర్మన్ కోడి నారాయణ ఆధ్వర్యంలో పలువురు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సోమవారం ఆదిలాబాద్‌లోని తన నివాసంలో వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి మోట్టె కిరణ్, కైలాస్, మహిళలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

గుడిహత్నూర్: మండలంలోని సీతాగోంది రైతువేదికలో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు 26 మంది లబ్ధిదారులకు సోమవారం చెక్కులు పంపణీ చేశారు. సీఎం కేసీఆర్ ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనలక్ష్మీ, కమలాపూర్ సర్పంచ్ ప్రేమల, ఎంపీటీసీ కృష్ణవేణి, నీలాబాయి, సోంబాయి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరాడ్ బ్రహ్మానంద్, రాందాస్, జలంధర్, రాజేశ్వర్, సంతోష్ గౌడ్, జమీల్ పాల్గొన్నారు.

'బెంగాలీ ఆర్‌ఎంపీలపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న సామ రూపేష్‌రెడ్డి

బేల: గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా హైడోస్ వైద్యం చేస్తున్న బెంగాలీ ఆర్‌ఎంపీలపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విచ్చలవిడిగా క్లినిక్‌లు నిర్వహిస్తున్న బెంగాలీ ఆర్‌ఎంపీలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖకు ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఠాక్రే విపిన్, మడావి చంద్రకాంత్, ఎండీ అఖిల్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ వైద్యులపై..

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో విధులు విస్మరించే వైద్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్ సిడ్మకి ఆనంద్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రిమ్స్‌లోని ప్రసూతి వార్డులో వైద్యులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హెచ్‌వోడీ పద్మిని నెలలో ఒకట్రెండు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారని, ఆమె పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యులకు విధులకు ఎగనామం పెడుతుందని తెలిపారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



కుట్టు మిషన్ల అందజేస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: మహిళలు ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. న్యాక్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలు, యువతులకు సోమవారం కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. స్థానిక భాగ్యనగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మహిళలకు అభినందించారు. ఈసందర్భంగా చైర్మన్‌ను న్యాక్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పందిరి భూమన్న, న్యాక్ ప్రతినిధులు కదిరా బేగం, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కైలాస్‌నగర్: పట్టణ ప్రజల సౌకర్యార్థం అన్ని వార్డుల్లో అభివృద్ధి చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం 14వ వార్డు పరిధిలో జరుగుతున్న సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులను పరిశీలించారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై కాలనీవాసులతో చర్చించారు. అనంతరం ఫిల్టర్ బెడ్‌లో మంచినీటి సరఫరా కోసం చేపడుతున్న పనులను పరిశీలించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, కౌన్సిలర్ ఆవుల వెంకన్న, సృజన్ రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదులకు రక్షణ కరువు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆదిలాబాద్‌టౌన్: న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ అన్నారు. ఢిల్లీలో న్యాయవాది వీరేందర్ కుమార్‌ను కాల్చిచంపడాన్ని నిరసిస్తూ సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కోర్టులో న్యాయం కోసం పోరాడే తమకే రక్షణ లేకుండా పోతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. న్యాయవాద రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. దుండగులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చందు సింగ్, ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ చౌదరి, సంయుక్త కార్యదర్శి బొల్లరం సుధీర్, స్పోర్ట్స్ కార్యదర్శి రవీందర్, న్యాయవాదులు రహీం, రమన్ దేశ్‌ముఖ్, ఘనశ్యామ్, అఖిలేష్ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్: గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్‌లు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలించ్చారు. తమ సమస్యలు పరిష్కరించానలి ఆర్జీలు సమర్పించారు. రైతుబంధు, డబుల్‌బెడ్ రూం ఇళ్లు, స్వయం ఉపాధి పథకాలు మంజూరు, వ్యవసాయ పరికరాలు అందించాలని కోరారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలు, ఓఎస్డీ కిష్టయ్య, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరవీరుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని ఏమాయికుంట సర్పంచ్ జాదవ్ లక్కన్ అన్నారు. సోమవారం గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయ్‌సింగ్, ఆరెల్లి రాందాస్, అశోక్, ధరణి ధనరాజ్, కొమురయ్య, సూర మల్లన్న, బీరయ్య, మల్లేష్, రవి, శేఖర్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లాలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయడం పట్ల బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం సంబురాలు జరుపుకున్నారు. పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. జిల్లా విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రభుత్వం జిల్లా కేంద్రంలో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సతీష్, కల్యాణ్, దాస్, హరీష్, రాజేష్, ఇబ్రహీం, సాయి, ప్రశాంత్, శివకుమార్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. బస్‌షెల్టర్ లేక ఇక్కట్లు



నేరడిగొండ: మండల కేంద్రంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపైనే బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎప్పటికైనా అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారి పేరు: శ్రీనివాస్, ఎన్‌హెచ్ఏఐ పీడీ, ఫోన్: 82839 01205

కొనసాగుతున్న పోషణ్ అభియాన్



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ కవిత



సర్టిఫికెట్ అందిస్తున్న ఏసీడీపీవో నర్మమ్మ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సోమవారం మండలంలోని అంకోలి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి మహిళాభివృద్ధి శిశు సంక్షేమ అధికారిణి వనజ హాజరయ్యారు. స్వస్థ బాలక్ స్పర్ధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నీరజ, సఖీ కేంద్రం సిబ్బంది లావణ్య, మహిత స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఆదర్శ్, భాగ్యశ్రీ, రాజు, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ భుక్తాపూర్ 7వ అంగన్‌వాడీ కేంద్రం, సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ అన్మోల్ కవిత అవగాహన కల్పించారు. సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ రాధ చిన్నారులకు యోగా ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో సంగీత, లావణ్య, అస్మా, ఫరియల్ బాను, నేహ అంజుమ్, తంకీన్, నాజ్మిన్, ఆశ ఆర్యకర్తలు రాజునా, భాగీరథ, రబ్బాని, నాజ్మిన్ పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

బేల: పోషకాహారంతో ఆరోగ్యకరంగా ఉంటారని ఐసీడీఎస్ జైనథ్ క్లస్టర్ ఏసీడీపీవో నర్మమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం 1లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. దీంతోపాటు వెల్ బేబీ షో నిర్వహించారు. వయస్సుకు అనుగుణంగా ఎత్తు, బరువు ఉన్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కిషోర బాలికలకు పోషకాహార అవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఠాక్రే వనిత, సూపర్‌వైజర్‌లు సుజాత, అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చడం అభినందనీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: ప్రతీ వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మండలంలోని చాందా (టి) గ్రామంలో ఉగ్గే సంతోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగ్గే దత్తు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉష్కం రఘుపతి, చాందా (టి) మాజీ సర్పంచ్ బొజ్జ అడేల్లు, సుదర్శన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని మండల కోఆప్షన్ మీర్జా జీలానిబేగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మారుతి డోంగ్రె మారుతి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మడావి భీంరావ్, వెంకట్‌రావ్, మహ్మద్ జునైద్, వెంకట్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో తాగునీటి ఫ్రిడ్జ్ ఏర్పాటు

బోథ్: బోథ్ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం తాగునీటి ఫ్రిడ్జ్ ఏర్పాటు చేసినట్లు కంట్రోలర్ గొల్లపెల్లి సాయన్న తెలిపారు. సోమవారం సర్పంచ్ సురేందర్ యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ గట్టు గంగాధర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ లింబాద్రి, తాహెర్ బిన్ సలాం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

8న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 8న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత, పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ రేఖ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో న్యాక్ బృందం వస్తున్న సందర్భంగా విద్యార్థులు హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

13న మత్స్య సహకార సంఘాలకు ఎన్నికలు

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్ ప్రాజెక్టు పరిధిలోని ఆదివాసీ గిరిజన మత్స్య సహకార సంఘాలకు ఈనెల 13న ఎన్నికలు నిర్వహించనున్నట్లు మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ఆత్రం బాపురావ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంఘంలోని సభ్యులు మాత్రమే పోటీ చేయవచ్చన్నారు. ఈనెల 4 నుంచి 6వరకు నామినేషన్ల స్వీకరణ, 7న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉయికే సుదర్శన్, జల్కే పాండురంగ్, పరచ సాయన్న, సుదాం, నైతం రమేశ్ పాల్గొన్నారు.

బలగం సినిమా ప్రదర్శన



బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బలగం చిత్రాన్ని ప్రదర్శించారు. కుటుంబ ప్రేమలు, ఆప్యాయతలపై సినిమాను చిత్రీకరించారని అన్నారు. బంధాలను గుర్తు చేయడం కోసమే సినిమా ప్రదర్శన చేసినట్లు తెలిపారు. సినిమా చూసేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు.